






ఇంటి వద్దకే.. రూ.7000



- జూలై 1న రూ.7 వేల పింఛన్
- ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిపి మొత్తంగా అందజేత
- తొలి రోజే అందించాలన్న లక్ష్యంతో కదులుతున్న ప్రభుత్వ యంత్రాంగం
- ఇంటికే వెళ్లి పింఛన్లు అందించేందుకు అధికారుల ఏర్పాట్లు
- సచివాలయ సిబ్బందితోపాటు, ప్రభుత్వ ఉద్యోగులకూ బాధ్యత
- మూడు జిల్లాల్లో 7.73 లక్షల మందికి రూ.541.43 కోట్ల లబ్ధి



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అన్నమాట ప్రకారం పింఛను మొత్తాన్ని రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచడమే కాకుండా ఆ మొత్తాన్ని ఏప్రిల్ నెల నుంచి లెక్కగట్టి మొత్తం రూ.7 వేలు అవ్వాతాతలు, ఒంటరి, వితంతు మహిళలు, ఇతర వర్గాల వారికి ఇవ్వనున్నారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.3 వేల పింఛను తీసుకున్నవారికి కూడా ఆ మూడు నెలలకు అదనంగా రావాల్సిన రూ.3 వేలు కూడా కలిపి మొత్తం ఏడు వేల రూపాయలు లబ్ధిదారులకు అందించనున్నారు.

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాజా గణాంకాల ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 7లక్షల 73వేల 482 మంది పింఛనుదారులకు పెరిగిన పింఛన్లతో లబ్ధి చేకూరనుంది. గుంటూరు జిల్లాలో 2,59,315 మంది, పల్నాడు జిల్లాలో 2,80,568 మంది, బాపట్ల జిల్లాలో 2,33,599 మంది పింఛనుదారులు వున్నారు. వీరందరికీ పెంచిన పింఛన్లు జూలై ఒకటో తేదీన చేతికి అందనున్నాయి. అందుకోసం ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులు జరిగిపోయాయి. జిల్లాలోని లబ్ధిదారుల కోసం రూ.541.43 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జూలై ఒకటో తేదీనాటికే లబ్ధిదారులు అందరికీ పింఛన్లు పంపిణీ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోంది. అందుకోసం ఏర్పాట్లు కూడా జరిగిపోయాయి. జిల్లాలోని సచివా లయ సిబ్బంది 13వేల మంది తోపాటు, ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులను కూడా పింఛన్ల పంపిణీ కోసం నియ మించారు.

20 రెట్లు పెంచిన చంద్రబాబు

2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయిన వెంటనే రూ.200గా వున్న పింఛనును ఒక్కసారిగా ఐదు రెట్లు పెంచి రూ.1000 చేశారు. ఆ తరువాత మరో మూడేళ్లకు ఆ వెయ్యిని రెట్టింపు చేసి రూ.2 వేలు పింఛను ఇచ్చారు. కాగా 2019 ఎన్నికల సందర్భంగా తాను పింఛను రూ.3 వేలు చేస్తానని హామీ ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ తాను అధికారం చేపట్టిన వెంటనే మాట తప్పారు. నాలుక మడతేసి తాను దశలవారీగా పెంచుతానని అవ్వాతా తలను వంచించారు. ఏడాదిన్నరకు ఒకసారి రూ.250 చొప్పున పెంచి వారిని వంచించారు. సరిగ్గా ఎన్నికల కు మూడు నెలల ముందు రూ.3 వేలు ఇచ్చి హామీని నిలబెట్టుకున్నట్లు మాజీ ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. ఐతే పింఛనుదారులెవరూ వారి మాటలు నమ్మలేదు. అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కసారిగా రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచారు. మొత్తంగా 200గా వున్న పింఛనును పదేళ్లలో 20 రెట్లు పెంచి ఇస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కింది.

11 కేటగిరీల వారికి 7 వేల పింఛను

మొత్తం 11 కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు రూ.7వేలు పింఛను ఇవ్వనున్నారు. వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, హెచ్ఐవీ బాధితులు, ట్రాన్సుజెండర్లు, డప్పు కళాకారులు, ఇతర కళాకారుల కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు ఈనెల రూ.7 వేల పింఛను అందుతుంది. మరుసటి నెల నుంచి రూ.4వేలు చొప్పున పింఛను అందనుంది. దివ్యాంగులు, కుష్ఠుబాధితులకు ఇక నుంచి రూ.6 వేలు, సాధారణ డయాలసిస్, కిడ్నీ, గుండె, లివర్ మార్పిడి బాధితులకు రూ.10వేలు చొప్పున, పూర్తి వైకల్యం, పక్షవాత బాధితులు, మంచంపట్టినవారికి రూ.15వేలు చొప్పున జూలై నెల నుంచి పింఛను అందించనున్నారు.

- వారి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిల నియామకం
- చైర్మన్ కార్యాలయాల సీజ్.. మార్కెటింగ్ శాఖ స్వాధీనం
- జేసీ/మార్కెటింగ్ జేడీలకు బాధ్యతలు అప్పగించే అవకాశం

మొండికేస్తున్నారని వేటు

ఏఎంసీల చైర్మన్లను తొలగిస్తూ ఆదేశాలు

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ నేతృత్వ పరిపాలన వచ్చింది. అయినప్పటికీ నైతికంగా నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కొందరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు మొండికేస్తున్నారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన మార్కెటింగ్ శాఖ ఆయా చైర్మన్లను తొలగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారి కార్యాలయాలను సీజ్ చేయాల్సిందిగా ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, తాడికొండ ఏఎంసీ చైర్మన్ పూర్ణచంద్రరావు, మాచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి(పెద్దబ్బాయి), చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి తమ పదవులను కోల్పోయారు. వారి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించే అధికారాన్ని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు కల్పించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో సంబంధిత మార్కెటింగ్ సెక్రెటరీలు చైర్మన్ల కార్యాలయాలను సీజ్ చేసి వారి ఆధీనంలోకి తీసుకున్నారు.

పదవీ కాలం ఉందని మొండి..

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వ్యవసాయ మార్కెట్ కమిటీలకు తన పార్టీకి చెందిన నాయకులకే నామినేటెడ్ పదవులను ఇస్తుంది. చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులను నామినేట్ చేస్తుంది. వీరంతా సంబంధిత ఎమ్మెల్యేల సిఫార్సులతో పదవులు పొందుతుంటారు. ఎన్నికల్లో ఒకవేళ గత ప్రభుత్వం ఓటమి పాలైతే నైతికంగా మార్కెట్ కమిటీల చైర్మన్లు, సభ్యులు కూడా వెనువెంటనే వైదొలుగుతుంటారు. అయితే ఈ దఫా అందుకు విరుద్ధమైన పరిస్థితులు కొన్ని మార్కెట్ కమిటీల్లో తలెత్తాయి. వైసీపీ ప్రభుత్వంలో నామినేట్ అయిన చైర్మన్లు తమకు ఇంకా పదవీకాలం ఉందంటూ కొంతమంది మొండికేశారు. వారికి ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాన్ని సెక్రెటరీలు తెలియజేసినా రాజీనామా పత్రాల సమర్పించేందుకు ససేమిరా అన్నారు. కొంత సమయం ఇచ్చి వేచి చూసిన ప్రభుత్వం శుక్రవారం తొలగింపు ఉత్తర్వులు జారీ చేసింది. తాడికొండ ఏఎంసీ చైర్మన్ పదవీకాలం జూలై 11 వరకు ఉన్నది. ఎన్నికలకు ముందు ఆయన టీడీపీలోకి మారడంతో తాను వైదొలిగేది లేదని చెప్పి కొనసాగుతున్నారు. గుంటూరు ఏఎంసీ చైర్మన్ పదవీ కాలం జూలై 18తో ముగుస్తుంది. చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ పదవీకాలం 2025 మార్చి 13, మాచర్ల ఏఎంసీ చైర్మన్ పదవి జూలై 2తో ముగుస్తాయి. వీరందరిని మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరి తొలగించారు. గతంలో చిన్న మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ జేడీ, సెలక్షన్ గ్రేడ్ ఉంటే జేసీలకు పర్సన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు కేటాయించేవారు.

ఎట్టకేలకు.. వదిలేశారు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఉన్నతాధికారుల ఇళ్లలో పని మాన్పించారు
- 26 మంది కార్మికులను ఇళ్ల నుంచి తొలగించారు
- ఇంకా 11 మంది కార్మికులు అక్కడే..
- ఇద్దరు డ్రైవర్‌లకు మునిసిపాల్టీ నుంచి జీతం
- నెలకు 8.19 లక్షలు జీతాలు చెల్లింపు

నరసరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఉన్నతాధికారుల ఇళ్లలో కార్మికులను పని మాన్పించారు. వారి ఇళ్లల్లో పనినుంచి తొలగించి పారిశుధ్య పనులకు కార్మికులను మళ్లించారు. మునిసిపాల్టీలో జీతం.. పని అధికారుల ఇళ్లలో అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై మునిసిపల్ అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఇళ్లలో పనిచేస్తున్న 26 మంది పారిశుధ్య కార్మికులను తిరిగి పారిశుధ్య పనులకు మళ్లించారు. ఇంకా 11 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నతాధికారుల ఇళ్ళలోనే పనిచేస్తున్నారు. వీరిని కూడా 1 నుంచి పారిశుధ్య పనులకు మళ్లించనున్నట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మునిసిపాల్టీలో ప్రక్షాళన కార్మికుల నుంచే ప్రారంభమైంది.

కొందరు జిల్లా ఉన్నతాధికారులు మునిసిపాల్టీని వారి సొంత జాగీరుగా వినియోగించుకున్నారు. మునిసిపల్ అధికారులను బెదిరించి మరీ వారి ఇళ్లలో పనులకు పారిశుధ్య కార్మికులను వినియోగించుకున్నారు. 37 మంది కార్మికులను ఉన్నతాధికారులు వారి ఇళ్లలో పనులకు వినియోగించుకున్నారు. చివరకు ఒక జిల్లా ఉన్నతాధికారికి తన కారుకు పనిచేసే డ్రైవర్లు ఇరువురికి కూడా మునిపిపాల్టీ నుంచి జీతాలు చెల్లించారు. దాదాపు ఉన్నతాధికారుల ఇళ్లలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు.. డ్రైవర్‌లకు దాదాపు నెలకు రూ.8.19 లక్షలు జీతాలు మునిసిపాల్టీ చెల్లించింది. దాదాపు 37 మంది కార్మికులు జిల్లా ఉన్నతా దికారుల ఇళ్లలో 20 నెలలుగా పనిచేస్తున్నట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు. ఈ మేరకు రూ.1.55 కోట్లు సదరు అధికారుల ఇళ్లలో పని చేసే కార్మికులకు జీతాలు మునిసిపాల్టీ చెల్లించడం గమనార్హం.

అధికారుల ఇళ్లలో పనిచేసేందుకు పారిశుధ్య విభాగం కార్మికులను నియమించడంతో పట్టణంలో పారిశుధ్య పనులు కుంటుపడ్డాయి. వ్యర్థాల తొలగింపు నిలిచిపోయి రహదారులు చెత్త మయంగా మారాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉన్నతాధికారుల ఇళ్లలో కార్మికులు పనిచేయించడంతో నాటి ప్రజాప్రతినిధి కూడా సహకరించారు. సదరు నేత మునిసిపల్ అధికారులను నిలదీసి ఉంటే అధికారులు కార్మికులను పనులకు మళ్లించే వారు కాదని చెప్పవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికారుల ఇళ్లలో పనులకు కార్మికులను నిలిపివేశారు. మునిసిపల్ కార్మికులను జిల్లా ఉన్నతాధికారుల ఇళ్లలో పనులకు పంపి చాలన్న నిబంధన లేద ని మునిసిపల్ అధికారులు తెలిపారు.





ఆధికారుల ఇళ్లలో పని చేసిన కార్మికులు ఇలా..

జిల్లా ఉన్నతాధికారి ఇంటిలో 15 మంది మునిసిపల్ కార్మికులు పనిచేశారు. గత 20 నెలలు వారు పనిచేస్తున్నారు. సదరు అధికారి ఇటీవల ఇక్కడ నుంచి వెళ్లారు. ఆయన నివాసంను కూడా ఖాళీ చేశారు. ఈ నేపథ్యంలో 11 మంది కార్మికులను ఇంటి పనుల నుంచి మునిసిపాల్టీ తొలగించింది. ఇంకా ఆ ఇంటిలో నలుగురు కార్మికులు పనిచేస్తున్నారు. ఉన్నతాధికారి పీఏ మునిసిపల్ అధికారులకు కాల్ చేసి కార్మికులను కొనసాగించాలని కోరుతున్నట్టు సమాచారం. అధికారి ఇంటిలో పనులకు సొంత నిధులతో పని వారిని నియమించుకోవాలి. ఇందుకు విరూద్ధంగా మునిసిపాల్టీలో జీతం తీసుకుంటున్న కార్మికులను ఇంటి పనులకు వినియోగించుకోవడం ఎంత వరకు సరైనదో ఆయన విజ్ఞతకే వదిలేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సదరు అధికారి కారుకు పనిచేసే డ్రైవర్‌లు ఇరువురికి కూడా మునిసిపాల్టీ నుంచి జీతాలు చెల్లింస్తున్నారు. మరో జిల్లా ఉన్నతాధికారి ఇంటిలో తొమ్మిది మంది కార్మికులు పనిచేస్తుండగా ఆరుగురిని మాన్పించి పారిశుధ్య పనులకు మళ్లించారు. గతంలో ఇక్కడ పనిచేసిన డివిజన్ స్థాయి అధికారిలో బదలీ అయ్యారు. ఆయన ఇంటిలో కూడా ముగ్గురు కార్మికులు పనిచేశారు. వీరిని కూడా పనలు మాన్పించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మరో డివిజన్ అధికారి ఇంటిలో ఇరువురు కార్మికులు పని చేస్తు న్నారు. జిల్లా కార్యాలయంలో దాదాపు ఎనిమిది మంది కార్మి కులు పనిచేస్తుండగా ఆరుగురిని సదరు పనులు మాన్పించి మునిసిపాల్టీ పనులకు మళ్లించారు. కార్యాలయ పనులకు కార్మికులను తీసివేయడంతో ఉన్నతాధికారుల పీఏలు మునిసిపల్ అధికారులపై నానా గొడవ చేస్తున్నట్టు సమాచారం ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల ఇళ్లలో పనుల మాన్పించిన 26 మంది కార్మి కులను కొన్ని వార్డుల్లో పారిశుధ్య పను లకు విని యోగిస్తుండంతో అ యా ప్రాంతాల్లో పరిశుభ్రత నెల కొంటోంది.

వర్సిటీలో అడ్డగోలు నియామకాలు

- అతిథి అధ్యాపకులకు నియామక ఉత్తర్వులు
- ప్రతి పోస్ట్‌కు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వసూళ్లు
- వీసీ రాజశేఖర్ వ్యవహారంపై భగ్గుమంటున వర్సిటీ వర్గాలు

పెదకాకాని, జూన్ 28: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ తీరు మరోసారి విమర్శలకు లోనవుతోంది. వర్సిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకి ఎటువంటి విధి విధానాలు పాటించకుండా హడావుడిగా బుధవారం నియామక ఉత్తర్వులను ఆచార్య పి.రాజశేఖర్ జారీ చేశా రు. గడిచిన రెండేళ్లలో ఎటువంటి నిబంధనలు పాటించకుండా, వైసీపీ పెద్దల సిఫార్సులతో పెద్దయెత్తున్న అతి థి అధ్యాపకులుగా నియమించారు. దీంతో పాటు వీసీకి నమ్మినబంట్లుగా పేరున్న కొందరికి అతిథి అధ్యాపకుల ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.5లక్షల నుంచి 7 లక్షల వరకు వసూలు చేసినట్లు వర్సిటీలో జోరుగా ప్రచారం జరుగుతుంది. 2019కి ముందు 45 మంది అతిథి అధ్యాపకులు ఉంటే వీసీ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు దాదాపు 75 మందిని అదనంగా అతిథి అధ్యాపకులుగా నియమించారు. కేవలం తనకు వ్యతిరేకంగా పనిచేశారన్న సాకుతో 2022లో ఐదుగురిని తొలగించారు. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం వీసీ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలు చెల్లవని కోర్టు కొట్టి వేసింది. దానితో పాటు 17 ఏళ్లుగా నిరాటంకంగా వర్సిటీలో సేవలందింస్తున్న అతిథి అధ్యాపకుల్ని విధుల నుంచి తొలగించటం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు తన పదవికి రాజీనామా చేస్తే తన అనుయాయులకు ఎక్కడ ఇబ్బంది కలుగుతుందో అని హడావిడిగా వారిని 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించి వీసీ హయాంలో చేపట్టిన నియామకాలపై విచారణ జరిపి, అక్రమాలను వెలికి తీయాలని వర్సిటీ వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పింఛన్.. వైసీపీ వారికే..

- పేదలను కాదని పెత్తందార్లకు
- గురజాలలో 1500 మంది నకిలీ లబ్ధిదారులు
- గురజాలలో వెలుగుచూసిన పింఛన్ల బాగోతాలు

గురజాలటౌన్, జూన్ 27: ఆరోగ్యంగా ఉన్న వారికి దివ్యాంగ పింఛన్.. మూడు పదుల వయసు కూడా నిండని వారికి వృద్ధాప్య పింఛన్.. భర్త బతి కుండగానే ఒంటరి మహిళ ఫించన్.. పేదలను కాదని పెత్తందారులకు పించన్ అందించారు.. మొత్తంమీద వైసీపీ జెండా మోయడం.. వైసీపీ నాయకులకు జై కొట్టడమే అర్హతగా సామాజిక పింఛన్ల ఎంపిక చేశారు. నిరుపేదలకు జీవనంగా ఉండాల్సిన పింఛన్ పంపిణీలో వైసీపీ ప్రభుత్వం మోసాలకు పాల్పడింది. గత ప్రభుత్వాల హయాంలో పెన్షన్ అందుకుని, అర్హులైనప్పటికీ టీడీపీ సానుభూతి పరులని నిర్ధాక్షిణ్యంగా వారికి పింఛన్ నిలిపివేశారు. గురజాల మండల పరిధిలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ పంపిణీలో జరిగిన అవినీతినిది. సామాజిక పింఛన్ అర్హతకు గత ప్రభుత్వాలు పలు నిబంధనలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేశాయి. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక వైసీపీ నేతలు కొందరు పింఛన్ కోసం అడ్డదారులు తొక్కారు. మన ప్రభుత్వమే కదా అడిగేదెవరులే అంటూ ఇష్టానుసారంగా వ్యవహరించారు. అప్పటి ప్రజాప్రతినిధులు కొందరు ఆరోగ్యంగా ఉన్నప్పటికీ దివ్యాంగులుగా నమోదు చేసుకుని పెన్షన్ నొక్కేశారు. వైసీపీకి చెందిన ఓ మహిళ తన భర్త బతికుండగానే ఒంటరి మహిళ ఫించన్ తీసుకుంది. రేషన్ డీలర్లు కూడా పింఛన్‌కు అర్హులుగా చూపుకుంటూ అడ్డదారిన బొక్కేశారు. ఇవే కాకుండా వైసీపీ జెండా మోశారని మూడు పదుల వయసు నిండని వారికి కూడా ఏదొక పేరుతో పింఛన్‌ను అందించారు.

● బ్రోకర్‌ను కలిస్తే చాలు..

వైసీపీ అధికారంలోకి వచ్చాక నూతన పెన్షన్ కోసం ఒక్కో మండలానికి ఒక్కో బ్రోకర్ వెలిశాడు. ఈ క్రమంలో గురజాల మండలానికి చెందిన వారు గంగవరానికి చెందిన ఆ బ్రోకర్‌ను కలవాల్సిందే. ఆయన ఒక్కో పింఛన్ మంజూరుకు రూ.20 వేల దాకా వసూలు చేశాడని సమాచారం. ముడుపులు ఇచ్చిన వారికి గుంటూరులోని జీజీహెచ్‌కు వెళ్లి దివ్యాంగ సర్టిఫికెట్ పుట్టించి పింఛన్ తెప్పిస్తాడు. ఈ వ్యవహారమంతా ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ప్రధాన అనుచరుడు నడిపించారని తెలిసింది.

నకిలీ పింఛన్లు ఇలా..

మండల పరిధిలో మొత్తం 18 సచివాలయాల పరిధిలో 9958 మంది దాకా పింఛన్ దారులు ఉన్నారు. దైదలో 80, గోగులపాడులో 25, గొట్టిముక్కలలో 30, సమాధానంపేటలో 20 ఇలా ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో నకిలీ పింఛన్లు ఉన్నాయి. గురజాల పట్టణంలోనైతే 150 పైచీలుకు ఉన్నాయి.

● టీడీపీ సానుభూతుపరుల పింఛన్ తొలగింపు

గత ప్రభుత్వాల హయాంలో పింఛన్ పొంది, అర్హులైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం రాగానే చాలా మందికి పింఛన్‌కు నిలిపివేశారు. వీరంతా టీడీపీ సానుభూతిపరులవడమే ఇందుకు కారణం. వీరిలో చాలా మంది నిరుపేద కుటుంబాలకు చెందిన అవ్వాతాతలు ఉన్నారు.

● ఎమ్మెల్యే యరపతినేనిపై గంపెడాశలు..

పేదలకు న్యాయం చేస్తారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు మంచి పేరుంది. అదే యరపతినేనిని ఈ సారి సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచారు. నకిలీ పింఛన్లను తొలగించి అర్హులకు పింఛన్లు ఇప్పించి న్యాయం చేస్తారని ప్రజలు గంపెడాశలతో ఉన్నారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ

● రాష్ట్ర నలుమూలల నుంచి వస్తున్న ప్రజలు ● సమస్యల పరిష్కారానికి లోకేశ్ హామీతో ఆనందం




వినతిపత్రాలు స్వీకరిస్తున్న నారా లోకేశ్, ఆక్సిజన్ సిలిండర్‌తో ప్రజాదర్బార్‌కు వచ్చి వినతిపత్రం అందిస్తున్న వ్యక్తి

తాడేపల్లి, జూన్ 28: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచేందుకు వారి సమస్యలు పరిష్కరించేందుకు యువనేత, రాష్ట్రమంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచి సైతం అర్జీదారులు ఉండవల్లి కరకట్ట వద్దకు వచ్చి లోకేశ్‌కు కలిసి సమస్యలు వివరిస్తున్నారు. సమయం కేటాయించి వారినుంచి వినతులు స్వీకరించి వాటిని సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపిస్తుండడంతో అర్జీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ మంత్రి అండగా విశాఖ జిల్లా గాజువాక మండలం దువ్వాడలో నాలుగు కోట్ల విలువైన 84 సెంట్ల భూమిని గత వైసీపీ ప్రభుత్వ అండతో డి.వెంకటరమణ, ఆర్.సత్యనారాయణ కబ్జా చేశారని తమకు న్యాయం చేయాలని గాజువాక మండలం డ్రైవర్ కాలనీకి చెందిన చూచుకొండ శ్రీనివాసరావు జె.తాతారావు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సదరు మాజీ మంత్రి ఓ సీఐ అండతో ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని ఆక్రమించారని కబ్జాదారుల చెర నుంచి తన భూమిని విడిపించాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. సమస్యను సావధానంగా విన్న లోకేశ్ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఆరేళ్ల నుంచి గుండె, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నానని 24 గంటలూ ఆక్సిజన్ సిలిండర్‌పైనే బతుకుతున్నానని చూచుకొండ శ్రీనివాసరావు కన్నీటి పర్యంతమయ్యారు. సాయమందిస్తానని లోకేశ్ తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన షేక్ సల్మా తాను రాష్ట్రస్థాయి పారా క్రీడల్లో రాణించానని పేదరికంలో ఉన్న తనకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కాగా మంగళగిరి నేషనల్ హైవే అథారిటీ అమరావతి యూనిట్‌ను విజయవాడ ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు యూనిట్‌లో కలిపేందుకు ఉత్తర్వులు జారీ చేశారని దీని వల్ల మంగళగిరిలో పనిచేస్తున్న ఉద్యోగులు రోడ్డున పడుతున్నారని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది కోరారు. మున్సిపల్ కార్పొరేషన్, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు వ్యాయామ దర్శకులుగా అప్‌గ్రేడ్ చేస్తూ పదోన్నతి కల్పించాలని చిత్తూరుకు చెందిన బి.శారద కోరారు. కాగా ఉదయం నుండే కరకట్టపై ప్రజాదర్బార్‌కు ప్రజలు బారులు తీరి కనిపించారు.

నేడు, రేపు ప్రజాదర్బార్‌కు సెలవు...

శని, ఆదివారాలలో ప్రజా దర్బార్ కార్యక్రమం లేదని తిరిగి కార్యక్రమం జరుగు సమయాన్ని తేదీని ఒక రోజు ముందుగానే ప్రకటిస్తామని ప్రజా దర్బార్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రజలు గమనించాలని కోరారు.

రాష్ట్రంలో రౌడీ మూకలకు కాలం చెల్లింది

● జగన్ కాపాడకుంటే పిన్నెల్లి పాపాల పుట్ట ఎప్పుడో పగిలేది

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్28: పల్నాడులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పెంచి పోషించింది, ఇంతకాలం కాపాడింది మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డియేనని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నార ప్రభుత్వం మారటంతో రాష్ట్రంలో రౌడీమూకలకు కాలం చెల్లిందన్నారు. పట్టణంలోని తన నివాస గృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలందరినీ భయం గుప్పెట్లోకి నెట్టి ఆ భయమే పెట్టుబడిగా వేల కోట్లు సంపాదించుకొని ఎంతో మంది టీడీపీ పార్టీ కార్యకర్తల రక్తం కళ్ళచూసిన రాక్షసుడు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అని అన్నారు. మాచర్ల కేంద్రంగా పిన్నెల్లి నిర్మించిన నేర సామ్రాజ్యాన్ని కూకటి వేళ్ళతో పెకలించటానికి సమయం ఆసన్న మైందన్నారు. పిన్నెల్లి అరెస్టు దెబ్బతో పల్నాడు ప్రాంత వైసీపీ నేతలతో పాటు ఇంతకాలం జగన్ అండతో చెలరేగి పోయిన రౌడీలందరికీ వణుకు మొదలైందన్నారు. పరారీలో ఉన్న పిన్నెల్లి సోదరుడు వెంకట రామిరెడ్డి, వారి చేతుల్లో ఆయుధాల్లా పనిచేసిన తురకా కిషోర్ ముఠాను సాధ్య మైనంత త్వరగా పట్టుకోవాలని, పల్నాడులో పూర్తిస్థాయి ప్రశాంత పరిస్థితులు నెలకొల్పటంలో ఇదే కీలకమని ప్రత్తిపాటి సూచించారు. పిన్నెల్లి ఐదు సంవత్సరాలుగా ఎన్నో నేరాలు, ఘోరాలు చేసినా బీసీ నాయకుడు తోట చంద్రయ్య హత్య రోజు నుంచే పిన్నెల్లి రాజకీయ పతనం ప్రారంభ మైందన్నారు. బాధితుల పైనే ఎదురు కేసులు పెట్టించి దోచుకున్న పిన్నెల్లి ముఠా వేళ్ళ కత్తిరింపుతో ప్రశాంత పల్నాడు సాధ్యమని, ఇంత కాలం అతడి దురాగతాలకు అండగా నిలిచిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ప్రత్తిపాటి కోరారు.

అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్పీ మాలికా గార్గ్

నరసరావుపేట లీగల్, జూన్ 28: ఒంటరి మహిళపై అత్యాచార, హత్య, దొంగతనం కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పల్నాడు ఎస్పీ మాలికా గార్గ్ వివరాలు వెల్లడించారు. మృతురాలు ఇంట్లోనే కిరాణా షాపు పెట్టుకొని అప్పుడప్పుడు అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఉండేది. భర్తతో గొడవలు పడి ఒంటరిగా జీవిస్తోంది. ఆమె తన ఇంటి పోర్షన్‌ను బాబునాయక్‌కు అద్దెకు ఇచ్చింది. ఈనెల 26న రాత్రి 9 గంటల సమయంలో బాబు నాయక్, అతని బంధువైన బాలు నాయక్‌తో కలసి మద్యం సేవించటానికి మృతురాలి వద్దకు వెళ్లారు ఆ సమయంలో ఆమె డబ్బులు లేనిదే మద్యం ఇవ్వలేననటంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహించిన ఇద్దరు నిందితులు ఆమె తలపై పప్పుగుత్తితో కొట్టి వెనుక గదిలోకి తీసుకు వెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె చెవులకు ఉన్న కమ్మలను, షాపులో ఉన్న కొంత డబ్బును తీసుకెళ్లారు. నిందితులను శుక్రవారం కారంపూడిలోని వినుకొండ రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలువ వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. పోలీసుల బృందంలోని సిబ్బందికి ఎస్పీ మల్లికా గార్గ్ ప్రత్యేక ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, జూన్ 28: నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయస్థాన భవన సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సంస్థ ఛైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎన్.సత్యశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, మోటారు వాహన ప్రమాద, రెవెన్యూ, బ్యాంక్, కుటుంబ సంబంధ కేసులు, ముందస్తు వ్యాజ్యాలు, రాజీ మార్గం ద్వారా పరిష్కరించు కోవచ్చన్నారు. కక్షి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచు కోవాలని ఆమె కోరారు.

విజ్ఞాన్స్ వర్సిటీ వీసీకి గౌరవ కల్నల్ ర్యాంక్



ఆచార్య పీ నాగభూషణ్

గుంటూరు(విద్య), జూన్ 28: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌కు ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను అందిస్తున్నట్లు న్యూఢిల్లీలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ శుక్రవారం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను త్వరలోనే ఆయనకు అందజేస్తామని వెల్లడించింది. విజ్ఞాన్స్ యూనివర్సిటీ అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సీసీని ఏకీకృతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థుల్లో క్రమశిక్షణ, స్నేహభావం, నిబద్ధత, సమగ్ర అభివృద్ధికిజ చేస్తున్నటువంటి కృషికి గాను ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను అందిస్తున్నామని వెల్లడించింది. నాగభూషణ్‌కు విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రి రజినీపై స్టోన్ క్రషర్ యజమానుల ఫిర్యాదు

తమ వద్ద తీసుకున్న రూ 2.20 కోట్లు తిరిగి ఇప్పించాలని వేడుకోలు

చిలకలూరిపేట, జూన్ 28 : రాష్ట్రంలో అధికార మార్పిడి జరగటంతో చిలకలూరిపేట నియోజక వర్గంలో మాజీ మంత్రి విడదల రజినీ బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి వారికి జరిగిన అన్యాయాలను వెల్లడిస్తున్నారు. శుక్రవారం యడ్లపాడు మండలం యడ్లపాడులో ఉన్న శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ నిర్వాహకులు ధైర్యంగా బయటకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత తమ ఫిర్యాదును స్థానిక శాసన సభ్యులైన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు, జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతికి, చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డికి అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. వైసీపీ హయాంలో తమ వద్ద నుంచి విడదల రజినికి రూ 2 కోట్లు, విజిలెన్స్ ఎస్పీ జాషువాకు రూ 10 లక్షలు, రజినీ మరిది విడదల గోపీకి రూ 10 లక్షలు బలవంత పెడితే ఇచ్చామని పేర్కొన్నారు. ఎస్పీ జాషువా తమ క్రషర్ వద్దకు వచ్చి రజినీ చెప్పినట్టు వినక పోతే రూ 50 కోట్లు ఫైన్ వేసి క్రషర్‌ను సీజ్ చేస్తామని బెదిరించారని వివరించారు.

అనంతరం రజినీ మరిదితో చర్చలు జరిపితే రూ 5 కోట్లు తమకు ఇస్తే ఫైన్ లేకుండా చూస్తామని చెప్పినట్టు వివరించారు. చివరకు ప్రాధేయ పడితే రూ 2.20 కోట్లకు మొత్తం వ్యవహారాన్ని సరి చేశారని పేర్కొన్నారు.

తమను బెదిరించి అక్రమంగా తీసుకున్న రూ 2.20 కోట్లను తిరిగి తమకు ఇప్పించాలని స్టోన్ క్రషర్ మేనేజింగ్ పార్ట్నర్ నల్లపనేని చలపతిరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు వారి నుంచి ప్రాణ భయం కూడా ఉన్నదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రజినీ పీఏ రామకృష్ణ పాత్ర కూడ ఉన్నదని వారు పోలీసులకు తెలిపారు.



గోపికృష్ణ పాడిమోస్తున్న ఎమ్మెల్యే వేగేశన, తహసీల్దార్ నిర్మలానందబాబా

యాజలికి గోపికృష్ణ మృతదేహం

● అమెరికాలో దుండగుని చేతిలో మృతి

కర్లపాలెం, జూన్ 28: అమెరికాలో దుండగుని చేతిలో తుపాకీ కాల్పులో మృతి చెందిన యాజలి వాస్తవ్యుడు దాసరి గోపికృష్ణ మృతదేహం వారం రోజులకు బాపట్లజిల్లా యాజలికి శుక్రవారం వేకువజామున చేరుకుంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, భార్య, బంధువులు వారం రోజులపాటు మృతదేహం కొరకు నిరీక్షించారు. మృతదేహం ఇంటికి చేరుకునే సరికి తల్లిదండ్రుల రోదనలను అపటం ఎవరి తరంలేకుండా పోయింది. బాపట్లశాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ యాజలిలో గోపికృష్ణ ఇంటికి వచ్చేశారు. తల్లిదండ్రులు ధనలక్ష్మి శ్రీనివాసరావు, భార్య ప్రవల్లికలను ఓదార్చే ప్రయత్నంచేశారు. గోపికృష్ణ మృతదేహానికి నరేంద్ర వర్మ పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. గోపికృష్ణ మృతదేహానికి దాహన సంస్కారాలకు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఒకవైపు మరోవైపు కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబాలు గోపికృష్ణ పాడిమోశారు. మృతుడు దాసరి గోపికృష్ణ భార్యకు ప్రభుత్వం తరపున ఉద్యోగం ఇప్పిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రెవెన్యూశాఖా మంత్రి రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు తెలియజేశారు.

అక్కడ మొక్కల్లేవు..

నిర్వహణకు రూ.60 వేలు.!

గుంటూరు(తూర్పు), జూన్ 28: గ్రామంలో మొత్తం 2వేల మొక్కలు నాటాం.. వాటి నిర్వహణకు రూ.20వేలు, కాపలా వారికి రూ.40వేలు మొత్తం నెలకు రూ.60వేలు చెల్లిస్తున్నామనే తప్పుడు బిల్లులు వెలుగులోకి వచ్చాయి. అసలు మొక్కలు లేకుండా వాటి నిర్వహణకు అంత ఖర్చు ఎలా పెట్టారని గ్రామస్తులు నివ్వెరపోయ్యారు. శుక్రవారం గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామసభలో అవకతవకలు బయటపడ్డాయి. దీనిపై టీడీపీ, జనసేన నాయకులు నిలదీస్తే అసలు వాస్తవాలు బయటకు వచ్చాయి. 2022లో ఉపాధి హామీ పథకంలో గ్రామానికి 2000 మొక్కలు వచ్చాయని, ప్రతి మొక్కకు రూ.30 ఖర్చు పెట్టామని మొత్తం నెలకు రూ.60 వేలు ఖర్చు అవుతుందని చెప్పి వైసీపీ నాయకులు తప్పుడు బిల్లులు సృష్టించారు. అప్పటి నుంచి 24 నెలలు పాటు ఈ తతంగం సాగింది. మొత్తం రూ.14 లక్షల 40వేల బిల్లులను డ్రా చేసినట్టు గుర్తించారు. గ్రామంలోని నాలుగురి ఖాతాల్లోకి జమ అయినట్టు గుర్తించారు. దీనిపై గ్రామ సభల్లో సిబ్బందిని అడగ్గా పొంతనలేని సమాధానం చెప్పారు. దీంతో తప్పుడు బిల్లులపై జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, విచారణ కోరతామని టీడీపీ, జనసేన నాయకులు స్పష్టం చేశారు.

నదులు అనుసంధానంతో

నీటి కొరత ఉండదు

● తెలంగాణ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్



తెలంగాణ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్

గుంటూరు సిటీ, జూన్ 28: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి పట్ల చంద్రబాబు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని తెలంగాణ, జార్ఖండ్ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్ అన్నారు. తన చిరకాల మిత్రుడు అయిన చంద్రబాబు నాయుడుని కలిసి అభినందనలు తెలిపానని వెల్లడించారు. శుక్రవారం గుంటూరు పట్టణం కృష్ణనగర్ శ్రీ లక్ష్మీ నారాయణ దేవస్థానానికి దర్శనార్థం విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చంద్రబాబుతో మాట్లాడటం జరిగిందన్నారు. దక్షిణ భారతంలో ఉన్న నదుల అనుసంధానం వల్ల వర్షపు జలాలు నిరుపయోగంగా సముద్రంలో కలవకుండా వుం టాయని అందువల్ల నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్లా మాధవి గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో గవర్నర్ ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమం అనంతరం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్ , గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులకపేట - బ్రహ్మనాథపురం రైల్వేగేటు తాత్కాలిక మూసివేత

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓవర్ హాలింగ్, రోడ్డు మరమ్మతులు నిమిత్తం నులకపేట - బ్రహ్మనాథపురం మధ్యన ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేటుని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటల వరకు గేటు మూసి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి పాదచారులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

దాడి సంఘటనలో 13 మంది వైసీపీ వర్గీయుల అరెస్టు

వట్టిచెరుకూరు: మండలంలోని గారపాడు ఎస్సీ కాలనీలో ఈ నెల 25వ తేది రాత్రి టిడిపి నాయకులు, సానుభూతిపరులు 7గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన కేసులో శుక్రవారం వైసీపీకి చెందిన కారసాల బుల్లెయ్యతో పాటు 13 ముందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. సీఐ ఉదయ్‌బాబు, ఎస్ఐ వినోద్‌బాబు, సిబ్బంది గురువారం ఎస్సీ కాలనీలో పర్యటించారు.

జీజీహెచ్ ప్రక్షాళనకు పెమ్మసాని అడుగులు

● నేడు కలెక్టర్, సూపరింటెండెంట్‌లో కలిసి ఆస్పత్రి సందర్శన

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)ని సమూలంగా ప్రక్షాళన చేసేందుకు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నడుం బిగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీజీహెచ్‌ని ఎంతైతే భ్రష్టు పట్టించాలో అంతగా పట్టించిన దృష్ట్యా అన్నింటిని గాడిన పెట్టాలని మంత్రి నిర్ణయించారు. అందులో భాగంగా శనివారం ఆయన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యులతో కలిసి ఆస్పత్రిలో ప్రతీ విభాగాన్ని సందర్శించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రోగులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఒక పూటంతా జీజీహెచ్ సందర్శన, సమీక్షకే సమయాన్ని కేటాయించారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జీజీహెచ్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకొన్నారు. అలానే సమగ్ర నివేదికని కూడా సిద్ధం చేయించారు. ఆ నివేదికని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానికి నివేదించనున్నారు. ఎస్ఆర్ఐల సహకారంతో పాటు కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించాలని కోరనున్నట్లు సమాచారం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

ప్రత్తిపాడు సీఐ, ఎస్ఐలపై సస్పెన్షన్ వేటు

● మండలంలో శాంతి భద్రత వైఫల్యమే కారణం

ప్రత్తిపాడు, జూన్ 28: ప్రత్తిపాడు సీఐ నిస్సార్ భాషా, ఎస్ఐ సోమేశ్వర రావులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల తరువాత మండలంలో జరిగిన శాంతి భద్రతల వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది. నాలుగు రోజుల క్రితం గొట్టిపాడు ఎస్సీ కాలనీలో ఫ్లెక్సీ వివాదం జరిగింది. ఈ క్రమంలో వైసీపీ నాయకులు కమ్యూనిటీ హాల్ స్టేజ్‌పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తీయించే విషయంలో రాత్రి మొత్తం వివాదం జరిగింది. తెల్లవార్లు గ్రామస్తులు రోడ్డుపై ఉండి తెల్లారిన తరువాత పంచాయతీ అధికారులు వచ్చి ఫ్లెక్సీని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే కాకుండా ప్రత్తిపాడులో కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఆక్రమణలో ఉన్న గృహాలను తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కమ్మా శివప్రసాద్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి వేటకొడవళ్లతో విచక్షణా రహితంగా నరకడం వంటివి జరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్తిపాడు మండలంలో ఇలాంటి సంఘటనలు జరిగిన నేపథ్యంలో ప్రత్తిపాడు సీఐ నిస్సార్ భాషా, ఎస్ఐ సోమేశ్వరరావులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారు.

క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలి

● తెలుగునాడు యూనియన్ నేతల విజ్ఞప్తి



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేతలు

గుంటూరు సిటీ, జూన్ 28: వైద్య, ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం) వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ఆశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసచార్యులు సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపకేంద్రాల్లో పనిచేస్తున్న రెగ్యులర్ మహిళా ఆరోగ్య కార్యకర్తలను రీడిప్లాయ్మెంట్ పేరుతో సుదూర ప్రాంతాలకు బదిలీ చేసి జగన్ ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురిచేసిందని మంత్రికి వివరించారు. ఏడుకన్నా ఎక్కువ సచివాలయాలు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు మగ ఆరోగ్య పర్యవేక్షకులు ఉండేలా చూడాలని కోరారు. అనవసర యాప్‌లతో ఏఎన్ఎంలపై మోపిన పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను మానవతా దృక్పథంతో వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు.

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, జూన్ 28: తాళాలు వేసి వున్న గృహాలే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన చిల్లర సురేష్, పెదనందిపాడుకు చెందిన కిరణ్ ముఠాగా ఏర్పడి రాష్ట్రంలోని పలుచోట్ల చోరీలకు పాల్పడ్డారని చెప్పారు. సీసీఎస్, మంగళగిరి రూరల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టారని తెలిపారు.. ఈ నేపథ్యంలో నిందితులిద్దరూ మంగళగిరి ఎన్నారై ఆసుపత్రి సమీపంలో వున్నట్టు పక్కా సమాచారం రావడంతో వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి సుమారు 29 గ్రాముల బంగారం, 40 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిలో సురేష్‌పై 50కి పైగా కేసులు, కిరణ్‌పై 30కి పైగా కేసులు వున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజ్, మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ వినోద్‌కుమార్, రూరల్ ఎస్ఐ క్రాంతికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పిన్నెల్లి అరెస్టుతో పల్నాడుకు ప్రశాంతత

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 28: పల్నాడు జిల్లా ప్రశాంత కోసం, ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు తొలి అడుగు మాత్రమేనని వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చని పల్లెల్లో ఫ్యాక్షన్ నేరగాళ్లను ఎగదోసిన పిన్నెల్లి మిగిలిన పరివారం సహా ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తి ఉండదని స్పష్టం చేశారు. అరాచక వైసీపీ సర్కారు పోవడంతో శాంతి భద్రతలకు మంచి రోజులు వచ్చాయని, పోలీసులు తమ పని తాము చేసుకోవచ్చని పిన్నెల్లి అరెస్టుతో స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు అయిందన్నారు. అయిదేళ్లుగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో నేరాలలకు పాల్పడ్డారని, వాటన్నిటికీ శిక్షలు పడితే జీవితాంతం అతడు జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం లేదన్నారు. ఇవే నేరాల్లో పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డి కూడా కటకటాల ఊచలు లెక్కించడం ఖాయమన్నారు. ఒక్క మాచర్ల నియోజకవర్గంలో గడిచిన అయిదేళ్లలో రూ.2వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.

పల్నాడు వార్తలు



పల్లాకు శుభాకాంక్షలు తెలుపుతున్న మధుబాబు, సత్తెనపల్లి టీడీపీ నేతలు

టీడీపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు

మాచర్లటౌన్, జూన్ 28: మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాస రావుకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సత్తెనపల్లి రూరల్ : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండల టీడీపీ అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాస రావులు అభినందించారు. మంగళగిరి టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో పల్లాను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నిమ్మగడ్డ నాగ శ్రీనివాస్, అలపర్తి గోపాలరావు, చొంటినేని మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.



సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో నిల్వలను పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్, పక్కన ఆర్డీవో

రేషన్ సరఫరాలో తేడా వస్తే క్రిమినల్ కేసులు

● జేసీ శ్యాంప్రసాద్ ● సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో తనిఖీలు

పిడుగురాళ్ల, జూన్ 28: రేషన్ సరఫరా వ్యవస్థలో తేడాలు రాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులపై వుందని జేసీ శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల పౌరసరఫ రాలశాఖ గోడౌన్‌ను జేసీ ఆకస్మిక తనిఖీచేశారు. రికార్డులు, నిల్వల పరిశీలనతో పాటు బియ్యం బస్తాలను తూకాన్ని గుర్తించారు. ప్రతిబస్తా తూకంవేసి డీలర్లకు ఎగుమతి చేసేలా చూడాలన్నారు. కార్డుదారులకు సక్రమంగా పంపిణీ అయ్యేవిధంగా చూడాలని, సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులపై వుందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మశ్రీ, ఆర్డీవో రమణా కాంత్‌రెడ్డి, పిడుగురాళ్ల తహసీల్దార్ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీల భరతం పడతా : జేసీ



జేసీతో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, దాచేపల్లి తహసీల్దార్ గీతావాణి

గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల, గురజాల మండలాల పరిధిలో రెవెన్యూ శాఖలో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని జేసీ శ్యాం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పిడుగు రాళ్లలో పౌరసరఫరాల శాఖ గోడౌన్‌ను అకస్మిక తనిఖీ చేసిన అనంతరం ఆయన తో ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి, దాచేపల్లి తహసీల్దార్ గీతావాణిలు రెండు రోజుల క్రితం రెవెన్యూ ధ్రువపత్రాలపై ఫోర్జరీ సంతకాల విషయంపై చర్చించారు. దాచేపల్లి మండలంలో పట్టాదారు పాస్ పుస్తకాలు నకిలీలు వున్నాయని, భూమి లేకుండా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయడం గతంలో జరిగాయని గుర్తు చేశారు. కాట్రపాడుకు చెందిన నరేంద్ర వర్మ అధికారుల సంతకాలను ఫోర్జరీచేసి కార్యాలయ ముద్రను వేయడంలో ఓ విఆర్ఏ తనయుడు వున్నట్లు గుర్తించడం జరిగిన తరువాత పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

ఈ విషయంపై జేసీ శ్యాంప్రసాద్ స్పందిస్తూ రెండు రోజుల్లో దాచేపల్లి మండలంలో భూరికార్డులను తనిఖీ చేసేందుకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మాచవరంమండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు చెందిన కొంత భూమిలో బయటి వ్యక్తులు చొరబడి రికార్డుల్లో నమోదు చేయించుకోవడం, బ్యాంక్ రుణాలు పొందటం తనదృష్టికి వచ్చిందని, ఈ విషయంపై జిల్లా డీఆర్వోను నివేదిక ఇవ్వాలని మూడుసార్లు కోరినప్పటికీ కుంటిసాకులు చెప్పాడన్నారు. పిడుగురాళ్ల మండలంలోనూ భూముల అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరుగుతుందని జేసీ వివరించారు. అదేవిధంగా ఎన్నికల ఫలితాల అనంతరం రెవెన్యూ అధికారులు ఎటువంటి భూములైనా ఆన్‌లైన్ చేయవద్దని, కేవలం విద్యార్థుల ధ్రువపత్రాలు మాత్రమే అందించాలని సూచించారు. కొందరు రెవెన్యూ అధికారులు బదిలీల మాయలో పడి ఏం చేసినా తెలియదనే కోణంలో భూముల ఆన్‌లైన్ వ్యవహారాలను చక్కపెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని జేసీ అన్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి పరీక్షలు

అచ్చంపేట, జూన్ 28: మండల కేంద్రమైన అచ్చంపేటలో శుక్రవారం గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు 6,7,8 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అచ్చంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షలకు 290 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించారు.

సత్తెనపల్లి రూరల్ : మండలంలోని రామకృష్ణాపురం వద్దగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శుక్రవారం పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 74 మంది విద్యార్థులు హాజరైనట్టు ప్రిన్సిపాల్ జాన్సన్ తెలిపారు.

కార్మిక నేత హుస్సేన్‌రెడ్డి మృతి

దాచేపల్లి, జూన్ 28: సీపీఐ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి కుమారుడు కార్మికనేత మందపాటి హుస్సేన్‌రెడ్డి (71) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. హుస్సేన్‌రెడ్డి దుర్గా సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూనే కమ్యూనిస్టు భావాలను పుణికిపుచ్చుకొని కార్మికుల కోసం తండ్రి నాగిరెడ్డితో కలిసి పలు ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆంధ్రా సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, తోటి కార్మికులు, పార్టీలకు అతీతంగా అన్నివర్గాలవారు హుస్సేన్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

పేదలకు వరంగా అన్నక్యాంటీన్లు

● క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
● నిర్వహణకు ముందుకొచ్చిన ఆర్యవైశ్య సంఘ నేతలు

మాచర్లటౌన్, జూన్ 28: నిరుపేదలు, నిర్భాగ్యులు, ఆకలితో అలమటించే వారికి అన్న క్యాంటీన్‌లు ఓ వరమని మాచర్ల శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యేందుకు కొంత సమయం పడుతున్నందున అంత వరకు క్యాంటీన్ నిర్వహణ బాధ్యత తీసుకుంటామని ఆర్యవైశ్య సంఘ నేతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇందుకుగాను వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, సూరె యలమంద, మారం ప్రసాద్, అవాంట్ సత్యం, కంభంపాటి అనిల్, చంటి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల పట్టణంలో అన్న క్యాంటీన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ధరకు భోజనం అందించడంతో పట్టణ ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.



మాచర్ల పట్టణంలో నూతనంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్

ఆకలి బాధ తీరనుంది : ఎస్కే. సుభాని, కార్మికుడు



టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన అన్న క్యాంటీన్లతో పేదలకు తక్కువ ధరలకే మంచి భోజనం అందించారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని మూసి వేసి తప్పుచేసింది. మరలా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్ తెరవడంతో పేదల ఆకలి బాధ తీరనుంది.

ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది
- డీ. నాగేశ్వరరావు, ముఠా కార్మికుడు



పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ఆనందంగా ఉంది. బయట హోటల్లో అధిక రేట్లు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. మంచి భోజనం అందించడం వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది.

భోజనం సంతృప్తినిచ్చింది
- పీ. కొండానాయక్, రైతు కూలీ



వివిధ పనులపై రెంటచింతల నుంచి మాచర్ల పట్టణానికి వచ్చాను. అన్నక్యాంటీన్‌లో నామ మాత్రం ఖర్చుతో రుచికరమైన భోజనం చేశాను. ఎంతో సంతృప్తినిచ్చింది. టీడీపీ ప్రభుత్వానికి, నిర్వాహకులకు నా కృతజ్ఞతలు.



అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

1న పింఛన్ల పండుగ

● వాడవాడలా నాయకులు హాజరయ్యేలా ఏర్పాట్లు

పిడుగురాళ్ల, జూన్ 28 : టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా పెంచిన పింఛన్లు జూలై 1వ తేదీ నుంచి పింఛన్‌దారుల చేతికి అందనున్నాయి. గత ప్రభుత్వం పింఛన్‌దారులకు నెలకు రూ.3 వేలు అందజేయగా, అధికారంలోకి వచ్చాక రూ.4 వేలకు పెంచడమే కాకుండా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కూడా పింఛన్ రూ.4 వేలు వర్తించేలా మొత్తం కలిపి ఒక్కో పింఛన్‌దారునికి రూ.7 వేలు అందించే ఏర్పాట్లు పండుగ వాతావరణంలా జరిగేలా చూడాలని టీడీపీ భావిస్తుంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 538 సచివాలయాల పరిధిలో 2,79,970 పింఛన్లు వున్నాయి. జూలై 1వ తేదీన 19 కోట్ల 97 లక్షల 2 వేల 500 రూపాయలు పింఛన్‌దారులకు అందనున్నాయి. జూలై 1వ తేదీన పింఛన్ల పంపిణీకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అధికారులు పింఛన్లను అందజేయనున్నారు. ప్రతి 50 పింఛన్లకు ఓ అధికారి మొదటి రోజే పింఛన్లు అందించేలా అధికారులు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోనూ టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి సభ్యుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ నగదును లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేయనున్నారు. గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లిలో 10,463, గురజాలలో 9,933, మాచవరంలో 7,480, పిడుగురాళ్ల అర్బన్‌లో 6,759, రూరల్‌లో 9,017 పింఛన్లు వున్నాయి. జూలై 1వ తేదీన గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పింఛన్‌దారులకు 6,13,72,000 రూపాయలను పింఛన్‌దారులకు అందించనున్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో పాటు పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ పింఛన్ల పంపిణీ పండుగ కార్యక్రమానికి హాజరయ్యేలా శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నూతన కార్యవరం ఎన్నిక

గురజాలటౌన్, జూన్ 28: పట్టణంలోని ఎన్జీవోహోంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేసన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ గురజాల తాలూకా యూనిట్ నూతన కార్యవర్గంను ఎన్నికున్నారు. అధ్యక్షునిగా జీవీ లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా జె శ్రీనివాసరావు, కోశాధికారిగా ఇ శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శిగా రాజమ్మ, సభ్యులుగా కెవి మణి, పీఎల్ ప్రసన్న, సుజాతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు నాగవర్ధన్, కోశాధికారి వెంకటప్పయ్య, ప్రసాదరావు పాల్గొన్నారు.

దోమ తెరలను వినియోగించండి

వెల్దుర్తి, జూన్ 28: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమ తెరలను వాడాలని డీఎంహెచ్‌వో రవి సూచించారు. మండలంలోని శిరిగిరిపాడు పీహెచ్‌సీ పరిధిలో గల సేవా నాయక్ తండాలో శుక్రవారం నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను ఆయన పరిశీలించారు. అలాగే హనుమాపురంలో జరుగుతున్న ఫిక్స్‌డే ప్రోగ్రాంను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిరిగిరిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి థెరిస్సా పాల్గొన్నారు.

అంబటి అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలి

సత్తెనపల్లి, జూన్ 28 : మాజీ మంత్రి అంబటి రాంబాబు అవినీతి, అక్రమ సంపాదనపై న్యాయ విచారణ జరిపించాలని టీడీపీ పల్నాడుజిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి అంబటి నియోజకవర్గంలో ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడి కోట్లు సంపాదించారన్నారు. జడ్పీ స్థలాన్ని కూడా తమ అనుచరులకు కేటాయించాలని గతంలో అదే పార్టీకి చెందిన జెడ్పీ చైర్మన్‌ను బెదిరించటం దుర్మార్గం అన్నారు. నియోజకవర్గంలో అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో లాటరీ టిక్కెట్లు క్రయించి సంపాదించారన్నారు. అంబటి అక్రమంగా సంపాదించిన ఆస్తులపై విచారణ చేపట్టాలని కోరారు.

జూలై 7న ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగరాలి

సత్తెనపల్లి, జూన్ 28 : జూలై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ పిలుపు నిచ్చారు. స్థానిక బాప్టిస్ట్ చర్చి ఆవరణలో శుక్రవారం రాత్రి పల్నాడు జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఒంగూరి అశోక్ కుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. బిక్షాలు మాదిగ మాట్లాడుతూ జూలై 7న ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవాన్ని ప్రతిగ్రామంలో ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో గరికపాటి హిట్లర్, చిలకా అగస్టసబాబు, ప్రేమ్ కుమార్, శివ, స్మాలన్ రాజు, డయాస్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లపై విచారణ చేపట్టాలి

సత్తెనపల్లి, జూన్ 28 : జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలకు సంబంధించి ఇసుక, ఇనుము, సిమెంట్ పంపిణీలో జరిగిన దోపిడీపై అధికారులు విచారణ చేపట్టాలని మాజీ కౌన్సిలర్ ఆకుల స్వరూప, టీడీపీ నేత హనుమంతరావు కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులకు కేటాయించిన ఇసుక, ఇనుము, సిమెంట్ పంపిణీ చేయకుండానే పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని అధికారులు లబ్ధిదారుల వద్ద సంతకాలు తీసుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కాంట్రాక్టర్ల ద్వారా నిర్మాణాలు చేపడుతున్న గృహాల్లో నాణ్యతా లోపాలు ఉన్నాయన్నారు. దీని పై ప్రభుత్వం విచారణ చేపటాలని కోరారు.

మాజీ ప్రధాని పీవీకి నివాళులు

సత్తెనపల్లి, జూన్ 28 : బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోవున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామ స్వామి, దివ్వెల శ్రీనివాసరావు, కళ్ళం విజయ భాస్కరరెడ్డి, పెద్దింటి వెంకటేశ్వర్లు, పెద్దింటి ఫణికృష్ణ, నాగ పార్వతయ్య, కోనంకి మారుతీ, మార్కెండేయ శర్మ, అంజిబాబు, వేదాన్తం వేణు, రామకృష్ణ, సాధు శివప్రసాదు, పలువురు ఐక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయండి

పెదకూరపాడు, జూన్ 28 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఉందని ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి అన్నారు. పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు అంకిత భావంతో పని చేసినప్పుడు మాత్రమే ఉత్తమ ఫలితాలు వస్తాయని, ఆ దిశగానే ఉపాధ్యాయులు పని చేయాలని సూచంచారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి పలు అంశాలపై ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి సత్యనారాయణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ, రాధాకృష్ణ, సీహెచ్ వెంకట నాగరాజు ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

అనధికార వ్యక్తులకు ప్రవేశం లేదు

సత్తెనపల్లి, జూన్ 28 : పురపాలక సంఘంలోని చైర్మన్ చాంబర్‌లోకి అనధికార వ్యక్తులు రావటానికి వీల్లేదని మునిసిపల్ కమిషనర్ షమ్మి శుక్రవారం విలేకరులకు తెలిపారు. కౌన్సిల్ సమావేశపు హాల్‌లోకి, చైర్మన్ చాంబర్‌లోకి చైర్మన్ వచ్చినప్పుడు ఆమె భర్త రావటం గతంలో జరుగుతుందన్నారు. చైర్మన్ చాంబర్‌లో ఆమె భర్త ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించటానికి వీల్లేదన్నారు. అనధికార వ్యక్తులకు ప్రవేశం లేదన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకే నడుచుకుంటామని ఆమె తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

సత్తెనపల్లి, జూన్ 28 : పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం నేరమని ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు పై సమావేశం నిర్వహించారు. డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి వివిధ ఆస్పత్రుల్లో తనిఖీల్లో గమనించిన అంశాల గురించి చర్చించారు. ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఎవరైనా ప్రైవేట్ వైద్యులు చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన మైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణీలకు పరీక్షలు చేసి బిడ్డ పుట్టబోయేది ఆడ బిడ్డ, మగ బిడ్డ అని చెప్పటం చట్ట రీత్యా నేరమన్నారు. ఇంకా వివిధ అంశాల గురించి సమావేశంలో చర్చించారు. సమావేశంలో డాక్టర్లు గీతాంజలి, సుజాత, ప్రేమ, ఎన్‌జీవో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

ముగిసిన పురపాలక సమావేశం

● అజెండాలోని అంశాల పై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీ

సత్తెనపల్లి, జూన్ 28 : పురపాలక సంఘ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్, మునిసిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వరరావునాయక్ తదితరులు పట్టణంలోని వివిధ సమస్యలు, ఎజెండాలోని అంశాల గురించి మాట్లాడారు. పురపాలక సంఘంలోని కూరగాయల మార్కెట్, సంత్రి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్ ఫీజు, మాంసం, చేపల మార్కెట్, పాటలకు సంబందించి ఫీజులు, ఆసీలు వసూలు చేసుకొనే హక్కు హెచ్చు పాట దారునికి కేటాయిస్తూ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. కొన్ని అంశాల పై కౌన్సిలర్లు చర్చించారు. ఎజెండాలో పొందు పరిచిన పలు అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ షమ్మి తెలిపారు. పట్టణంలోని పలువార్డుల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. ఇంకా వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో డీఈ మధుసూదనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారథి, వైస్ చైర్మన్ నాగుల్ మీరా, గుజ్జర్లపూడి సతీష్, టీ మేరీ గ్రేస్, జానీ బాషా, కటకం రామకృష్ణ, కంభంపాటి అబ్రహం, కూకుట్ల లక్ష్మీ, శెట్టి ఆనంద్, బండి రాజ్యలక్ష్మీ, వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొన్నారు.



విద్యార్థినికి కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

విద్యతో బంగారు భవిష్యత్తు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ● విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

అమరావతి, జూన్ 28: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాది పాఠశాల విద్య అని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ ఆడిటోరియంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రవీణ్ విద్యార్థిని విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేవైపుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు మండలంలో 4వేల మంది విద్యార్థినీ, విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు ఎక్కడా ఏ ఒడిదొడుకులు లేకుండా చదువులో ముందుకు సాగాలన్నారు. కుటుంబంలో చదువుకునే ప్రతి విద్యార్థికి తగిన ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందించేందుకు ప్రణాళిక చేస్తుందన్నారు. త్వరలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. నియోజకవర్గ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్‌ను ఉపాధ్యాయ సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, శివబాబు, స్థానిక ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు తహసీల్దార్ వెంకటరమణారావు, వైస్ ఎంపీపీ ఎం. శ్రీనివా సరావు, సర్పంచ్ పీ.రాజేశ్వరి పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

● మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
● జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మాచర్ల రూరల్, జూన్ 28: యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బంగ్లా గ్రౌండ్‌లో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ అన్వర్‌బాషా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో నైపుణ్యం పెంచుకొని ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. క్రీడలకు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి, స్నేహపూరిత వాతావరణానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, యువనేత జూలకంటి అక్కిరెడ్డి, ఓర్సు క్రాంతికుమార్, నాగూర్‌బాషా, రామాటాకీస్ జాని, మదీన్, మూరబోయిన శ్రీహరి, కరీం, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేద్దాం

బెల్లంకొండ, జూన్ 28 : జిల్లా పరిషత్ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేద్దామని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ సూచించారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూలక్ష హెచ్‌ఎం సామ్రాజ్యంతో సమవేశమైన ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో అన్ని వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుందామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులను ప్రభుత్వ మెను ప్రకారం భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో పాఠశాలలను అన్నివిధాలా అభివృద్ధి పరుద్దామని అన్నారు. సమావేశంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ సుభానీ, టీడీపీ నేతలు పీఎస్‌కే రసూల్, సయ్యద్ జానీ, ఎస్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

పెదకూరపాడు, జూన్ 28 : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేయటం అభినందనీయమని జనచైతన్య సమితి కో-ఆర్డినేటర్ వెలితోటి అనీల్ కుమార్ అన్నారు. జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పిడుగురాళ్ళ ఇన్‌చార్జి లైబ్రేరియన్ కారంపూడి రాజశేఖర్, కుమార్తె అలెక్సా గ్రేస్ రెండవ పుట్టినరోజును పురస్కరించుకొని మండలంలోని రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొంగులూరి రాణెమ్మ, పాఠశాల హెచ్‌ఎం పీ జోస్పీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

నకరికల్లు, జూన్ 28 : వ్యవసాయ అధికారి కే.దేవదాసు శుక్రవారం విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎన్.చిన్నయ్య అండ్ సన్స్ విత్తనాల షాపును తనిఖీచేసి విత్తనాల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌ను, బిల్లు బుక్స్‌ను పరిశీలించారు. కొనుగోలు చేసిన రైతులందరికీ రసీదులు ఇవ్వాలని సూచనలు చేశారు. వరి విత్తనాల నిల్వల నుంచి నాలుగు శ్యాంపిల్స్‌ను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం వాటిని ప్రయోగశాలకు పంపారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని ఏవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.శౌరయ్య, పీ.కిషోర్ బాబు పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన

నకరికల్లు, జూన్ 28 : వ్యవసాయ అధికారులు శుక్రవారం చేజర్లలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. కౌలు రైతు దారులంతా పంట సాగు హక్కు పత్రాన్ని పొందాలని ఈ సందర్భంగా ఏవో కే.దేవదాసు కోరారు. వీఆర్‌వో లేదా వ్యవసాయ సహాయకుల వద్ద కౌలు రైతు దారులు హక్కు పత్రంకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు సందర్భంతో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌వో కృష్ణ కుమారి, హెచ్‌ఏ వంశీ, రైతులు పాల్గొన్నారు.

వేమవరం సంగం డెయిరీ అధ్యక్షుడిగా నారపశెట్టి

మాచవరం, జూన్ 28: మండలంలోని వేమవరం గ్రామ సంగం డెయిరీ అధ్యక్షుడిగా నారపశెట్టి నారయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక సంగం డెయిరీలో నిర్వహించిన ఎన్నికల కార్యక్రమానికి పొన్నూరు సంగం డెయిరీ నుంచి అంజిరెడ్డి ఎన్నికల అధికారిగా వచ్చి ఎన్నికల నిర్వహణను చేపట్టారు. సంగం సభ్యులందరూ నారపశెట్టి నారయ్యను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈమేరకు నారయ్యకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారి అంజిరెడ్డి అందజేశారు. కార్యక్రమలో టీడీపీ సీనియర్ నేతలు పంపనీడి పుల్లయ్య, కొలగాని శివ, ఏసుపొంగు ఆనందరావు, బీసీ నాయకులు గోళ్ల గంగాధర్, కొక్కెర వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

వెల్దుర్తి, జూన్ 28: కాంట్రాక్ట్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్స్ రాష్ట్ర యూనియన్ సెక్రటరీ గిరిజారాణి, ఉమెన్ సెక్రటరీ పుణ్యవతిలు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డిని కలిసి వారు వినతిపత్రం అందించారు. డీఎస్సీలో సీఆర్టీ పోస్టులను కలపకుండా రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. అలాగే కాట్రాక్ట్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు.

పల్నాడు వార్తలు

నేడు జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, జూన్ 28: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకే నేడు న్యాయస్థాన భవన సముదాయంలో నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్ సత్యశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, రెవెన్యూ కేసులు, బ్యాంక్ కేసులు, కుటుంబ సంబంధ కేసులు, ముందస్తు వ్యాజ్యాలు, రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆమె కోరారు. తద్వారా కక్షిదారులకు సమయం, ధనం ఆదా అవుతుందన్నారు.

సీఎంను కలిసిన కొమ్మాలపాటి శ్రీధర్



సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడుతున్న కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, జూన్ 28: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శుక్రవారం టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వెలగపూడి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలో పలు అంశాలపై ఆయన చర్చించారు.

డయేరియా నివారణకు సమన్వయంతో కృషిచేయాలి

● ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి

శావల్యాపురం, జూన్ 28: డయేరియా బారినపడి గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులెవ్వరూ మృత్యువాత పడకుండా నివారించేందుకు మండలంలోని గ్రామస్థాయి అధికారులంతా సమన్వయంతో కృషిచేయాలని ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జులై 1 నుంచి ఆగస్టు 16వ తేదీ వరకు జరగనున్న డయేరియా నివారణ కార్యక్రమాల అమలుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, రెవెన్యూ వైద్యశాఖల సిబ్బందితో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని బావులు, చెరువులు, తాగునీటి పథకాల వద్ద పంచాయతీ కార్యదర్శులు క్లోరినేషన్ చేయించాలని, తాగునీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్యాధికారి రావిపూడి రమ్య మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి డయేరియా లక్షణాలున్న వారిని గుర్తించి వెంటనే చికిత్స అందించాలని, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని పీహెచ్‌సీలకు పంపాలన్నారు. ఈవోపీఆర్డీ సుగుణ, ఏవో వాణి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఏడుకొండలు, భారతి, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, జూన్ 28: అతిసార వ్యాధి రాకుండా జాగ్రత్తలు వహించాలని వైద్యాధికారులు సాయిబాబు, మురళీధర్‌లు శుక్రవారం పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుషితమైన నీటిని తాగవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు ఆహారం తీసుకొనే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఈ విషయాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకుమారి, ఎంఈవో బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

పలు శాఖల్లో ఉద్యోగుల ప్రక్షాళన

రొంపిచర్ల, జూన్ 28: మండలంలోని గ్రామాల్లో పలు శాఖల్లో ప్రక్షాళనను తెలుగుదేశం పార్టీ నాయకులు చేపట్టారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రాగానే కొందరు ఉద్యోగులను ఆ పార్టీ నేతలు తొలగించి తమపార్టీ నాయకులను విధుల్లో చేర్చారు. ప్రస్తుతం మహిళా సమాఖ్య విభాగంలో అలవాల, అచ్చయ్యపాలెం, సుబ్బయ్యపాలెం, విప్పర్లపల్లి, అన్నవరప్పాడు, మునమాక, ముత్తనపల్లి, కొనకంచివారిపాలెం, కర్లకుంట, రామిరెడ్డిపాలెం గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వీవోఏలను తొలగించారు. వీరితో పాటు మరికొన్ని గ్రామాల్లో వారిని కూడా తొలగింపు దిశగా చర్యలు చేపడుతున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా మార్పులు చేపట్టనున్నట్టు తెలియవచ్చింది. గోగులపాడు, తురుమెళ్ళ, సుబ్బయ్యపాలెం, అన్నవరం, తుంగపాడు, వడ్లమూడివారిపాలెం, కర్లకుంట, రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో పలువురు అంగన్‌వాడీ వర్కర్లను, హెల్పర్లను తొలగించనున్నట్టు తెలిసింది.



మృతుని భార్యకు చెక్కు అందజేస్తున్న మేనేజర్ నాగప్రభు

డీవీసీ అభయ స్కీం నగదు అందజేత

కారుమంచి (శావల్యాపురం) జూన్ 28: సంగం డెయిరీలో అమలు చేస్తున్న డీవీసీ అభయ స్కీంతో తమ సంస్థలో పనిచేస్తూ మృత్యువాత పడ్డ ఉద్యోగుల కుటుంబాలను సంగం డెయిరీ ఎంతగానో ఆదుకొంటుందని వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ కొత్తపల్లి నాగప్రభు అన్నారు. మండలంలోని కారుమంచి సంగం డెయిరీ సెంటర్లో 40ఏళ్ళ పాటు కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల మృతి చెందిన మేదరమెట్ల నరసింహారావుకు సంగం డెయిరీ డీవీసీ అభయ స్కీం మరణ సహాయ నిధి నుంచి రూ.1,47,115 చెక్కును మృతుని భార్య మేదరమెట్ల విజయలక్ష్మికి సంగం డెయిరీ అధికారులు శుక్రవారం అందజేశారు. వినుకొండ సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు మాట్లాడుతూ పాలఉత్పత్తిదారులకు సంగం డెయిరీ ఎంతో తోడ్పాటునందిస్తుందని, ప్రమాద బీమా పథకాల ద్వారా పాలఉత్పత్తిదారులతో పాటు సంస్థలో పనిచేసే ఉద్యోగులను కూడా ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల సొసైటీల కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆలూరి రమణయ్య, కారుమంచి సంగం డెయిరీ సెంటర్ అధ్యక్షుడు ఎస్.శంకరరావు, మాజీ అధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి ఎ.నరసింహారావు, సూపర్‌వైజర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

ఈపూరు, జూన్ 28: ఈపూరులోని వీరేశ్వరస్వామి ఆలయ భూములకు శుక్రవారం దేవదాయ శాఖాధికారులు కౌలు వేలం నిర్వహించారు. 12ఎకరాల 75సెంట్ల భూముల కౌలుకు వేలం నిర్వహించగా మూడు సంవత్సరాలకు రూ.3లక్షల 5వందలకు 9 మంది రైతులు పాడుకున్నారు. మరో 0.54 సెంట్లకు కౌలు వేలం జరగాల్సి ఉందని దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి బీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో కంటే కౌలు ఆదాయం రెట్టింపుస్థాయిలో పెరిగిందని, వచ్చిన ఆదాయాన్ని భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి ఖర్చుపెట్టడం జరుగుతుందన్నారు.

మాజీ మంత్రి రజినీకి ఝలక్

▸▸ ఇచ్చిన కమీషన్ వెనక్కి గుంజుకున్న రైతులు

▸▸ గతంలో మాజీ మంత్రి రూ.1.16 కోట్లు నొక్కుడు

▸▸ ప్రభుత్వం మారడంతో పోలీసులకు రైతుల ఫిర్యాదు

▸▸ 90 లక్షలు తిరిగిచ్చిన రజిని.. నేడు మరో 26 లక్షలు



చిలకలూరిపేట, జూన్ 28: ప్రభుత్వం మారడంతో జగన్ హయాంలో జరిగిన అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. జగనన్న కాలనీకి భూములు ఇచ్చిన రైతుల నుంచి మాజీ మంత్రి విడదల రజిని రూ.1.16 కోట్ల కమిషన్ నొక్కేశారు. తాజాగా రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ డబ్బు వసూలు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో విడదల రజిని రైతుల వద్ద కమీషన్‌గా తీసుకున్న డబ్బును గురువారం వెనక్కి ఇచ్చేశారు. గ్రామానికి చెందిన చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, రైతు నాయకుడు గడిపూడి దశరథ రామయ్యలు తెలిపిన వివరాలు ప్రకారం.. పసుమర్రుకు సమీపంలో ఉన్న గుదేవారిపాలెంలో సుమారు 200 ఎకరాల్లో జగనన్న కాలనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంత్రిగా రజిని హయాంలో 150 ఎకరాల భూసేకరణకు ఏర్పాటు చేశారు. ఇందులో 32 మంది రైతుల నుంచి 50 ఎకరాల భూసేకరణ చేశారు. అప్పట్లో ఎకరాకు రెండున్నర లక్షలు చొప్పున చిన్న చిన్న మినహాయింపులు పోను మొత్తం రూ.1.16 కోట్ల మొత్తాన్ని మంత్రి రజిని తన అనుచరుల ద్వారా ముక్కు పిండి వసూలు చేశారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం మారిన పరిణామాల నేపథ్యంలో ఈ విషయంపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి కూడా ఈ విషయాన్ని తెచ్చారు. ఈ నేపథ్యంలో రజిని మనుషులు రైతులకు రూ.90 లక్షలు వెనక్కి ఇచ్చారు. మిగిలిన రూ.26 లక్షలు శుక్రవారం రైతులకు ఇచ్చే ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో తమకు న్యాయం జరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

గోడ తొలగింపు

పసుమర్రు నుంచి జాతీయ రహదారి గుండా గొర్రెల మండి పక్కగా చిలకలూరిపేటకు వచ్చే మార్గంలో విడదల రజిని కుటుంబ సభ్యులు అడ్డంగా గోడ కట్టారు. ఆ మార్గంలో రాకపోకలకు వీలు లేకుండా చేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనిపై ఆ గ్రామవాసులు నిరసన తెలిపినప్పటికీ లెక్కచేయలేదు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆ గోడను రజిని కుటుంబ సభ్యులు తొలగించారు. ఆ మార్గంలో ఉన్న భూమిని తాము దానం చేస్తున్నట్లు పంచాయతీకి లిఖిత పూర్వకంగా తెలిపారు.

బస్టాండ్ వద్ద డ్రెయిన్‌కు మరమ్మతులు

ఎమ్మెల్యే జీవీ ఆదేశాలతో పారిశుధ్య చర్యలపై ప్రయాణికుల హర్షం



ఆర్టీసీ డిపోలో డ్రెయినేజీ మరమ్మతులు చేస్తున్న కార్మికులు

వినుకొండ టౌన్, జూన్ 28: ఆర్టీసీ డిపోలో డ్రెయినేజీ, మరుగుదొడ్లు, మూత్ర విసర్జన పరిసర ప్రాంతాలు అధ్వానంగా మారి దుర్గంధం వెదజల్లుతూ, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం ఆర్టీసీ డిపోను పరిశీలించి, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే మున్సిపల్ అధికారులను పిలిచి, పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. స్పందించిన అధికారులు వెంటనే పారిశుధ్యం పనులు చేపట్టడంతో పాటు, మురుగునీరు ప్రవాహానికి అడ్డంకులు తొలగాయి. దీంతో స్థానికులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే రాకతో ఆర్టీసీ డిపోలో పారిశుధ్యం మెరుగుపడిందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీఆర్‌ఏలకు అలవెన్స్ చెల్లించరూ...

● జేసీకి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం వినతి

నరసరావుపేట రూరల్, జూన్ 28: పల్నాడు జిల్లాలో ఎన్నికల విధులకు సంబంధించి అలవెన్స్ వీఆర్‌ఏలకు వెంటనే చెల్లించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీసాహెబ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్‌ను పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్, వీఆర్‌ఏలు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించి అలవెన్స్ వీఆర్‌ఏలకు వెంటనే చెల్లించాలన్నారు. కొన్ని మండలాలు కేవలం 200 రూపాయలు 300 రూపాయలు మాత్రమే మొక్కుబడిగా చెల్లించారని, ఎలక్షన్‌కు సంబంధించి వీఆర్‌ఏలు అనేక రకాల డ్యూటీలు రాత్రి, పగలు చేశారని జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. అలవెన్స్ చెల్లించేలా చర్య తీసుకుంటానని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, నకరికల్లు మండల అధ్యక్షుడు కాసులు, వెంకట్రావు, క్రోసూరు మండల అధ్యక్షుడు దినేష్, ముప్పాళ్ళ మండల ప్రధాన కార్యదర్శి బుడే, రొంపిచర్ల మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, చిలకలూరిపేట మండల నాయకుడు శివ, నరసరావుపేట మండల అధ్యక్షుడు రోశయ్య కోటయ్య, బాష, సిలారు, మీరా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఘన నివాళి

నరసరావుపేట టౌన్, జూన్ 28: నరసరావుపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 104వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీసర్వేపల్లి బ్రహ్మణ ఉద్యోగ సేవా సంఘం ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద సంఘం ప్రతినిధులు నివాళి అర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, భాగీ సుబ్బారావు, తుర్లపాటి సత్యనారాయణ, డాక్టర్ సింధూజ, పోలేపెద్ది రాధా కృష్ణమూర్తి, దుర్గాబాబు, హనుమంతురావు, బెహరా శ్రీనివాసరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య అభివృద్ధికి చర్యలు

● ఎంపీడీవో ఏవీ రంగనాయకులు

ఈపూరు, జూన్ 28: మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి ఏవీ రంగనాయకులు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ, వైద్య అధికారులతో డెంగీని నిలువరిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు వ్యాధులపై అవగాహన కలిగించాలన్నారు. అదే విధంగా నిల్వ ఉండే నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా డ్రెయినేజిని శుభ్రపరిచి దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు నాగేంద్రబాబు, సీడీపీవో అరుణ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణ నాగరాజుకు డాక్టరేట్

రొంపిచర్ల, జూన్ 28: మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామానికి చెందిన స్వర్ణ నాగరాజు ప్రజాసేవ చేసినందుకు అమెరికాకు చెందిన హెచ్‌ఎస్‌సీ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మిత్రుల సహాయ సహకారాలతో పేదల ఆకలి తీరుస్తున్న నాగరాజు సేవలను గుర్తించి ఈ డాక్టరేట్‌ను గురువారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లోని యూనివర్శిటీ భవనంలో డైరెక్టర్ బిషప్, డాక్టర్ ఆనంద కుమార్ ఈ అవార్డును అందజేశారు.

ఈకేవైసీ పేరుతో డబ్బు వసూలు తగదు: రాము

వినుకొండ, జూన్ 28: గ్యాస్ లబ్ధిదారుల నుంచి గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసీ పేరుతో డబ్బులు వసూలు చేయడాన్ని భారత కమూనిస్టు పార్టీ నాయకులు ఉలవులపూడి రాము శుక్రవారం తీవ్రంగా ఖండించారు. గ్యాస్ లబ్ధిదారులు, గ్యాస్ కార్యాలయాల వద్ద రోజులు తరబడి, ఎండలో నిలబడి, రోజంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తహసీల్దార్ బ్రహ్మయ్య దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ గ్యాస్ ఏజెన్సీ యజమానులకు ఫోన్‌ద్వారా సంప్రదించి డబ్బులు వసూలు చేయడంపై మండిపడ్డారు. లబ్ధిదారులకు అవసరం అనుకుంటే పైపు ఇవ్వాలని, ఈకేవైసీకి, పైపునకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మరోమారు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

కొచ్చెర్ల (ఈపూరు) జూన్ 28: కత్తితో దాడిచేసిన సంఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పానీపూరీ అమ్ముకునే వారిపై పసుపులేటి వీరయ్య గొడవపడుతున్నాడు. గొడవ గురించి అడిగినందుకు కొచ్చెర్ల ఏడుకొండలుపై వీరయ్య కత్తితో దాడి చేశాడు. దాడిలో ఏడుకొండలు చేతికి రెండుచోట్ల గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మినీ ట్రక్ బోల్తా... 15మందికి గాయాలు

నూజెండ్ల, జూన్ 28: మండలంలోని నూజెండ్ల, వీ అప్పాపురం మధ్యలో ఉన్న ఎన్ఎస్‌పీ కాలువలో మినీ ట్రక్ బోల్తాపడి 15 మందికి గాయాలైన సంఘటన శుక్రవారం వేకువ జామున జరిగింది. మారెళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన రైతులు, రైతు కూలీలు 35మంది రెండు మినీ ట్రక్కుల్లో శ్రీశైలం, మహానంది వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో జమ్మలమడక మేజరు కాలువ బ్రిడ్జి వద్ద మినీ ట్రక్కు అదుపుతప్పింది. బ్రిడ్జికి సైడువాల్స్ లేకపోవటంతో మినీట్రక్ కాలువలోకి దూసుకుపోయింది. మినీ ట్రక్‌లో 23మందికి పైగా ఉన్నారు. వీరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మినీట్రక్ బోల్తాపడితే ప్రాణ నష్టం సంభవించేదని సంఘటనా స్థలాన్ని సందర్శించిన వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. క్షతగాత్రులను 108 అత్యవసర వాహనం ద్వారా వినుకొండ ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు తరలించారు. తాటిపర్తి సీతారెడ్డి, పొట్లపల్లి నిరోషా, సింగారెడ్డి నారాయణమ్మ, నక్కా సీతారాములు, బత్తుల నాసరమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రభుత్వ మెనూ పాటించకపోతే చర్యలు

● మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు

శావల్యాపురం, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజనం పథకంలో ఎండీఎం ఆపరేటర్లు ప్రభుత్వం ఇచ్చిన మెనూను పాటించకపోతే వారిపై చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని తుమ్మలకుంట, పోట్లూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన శుక్రవారం తనిఖీచేశారు. తుమ్మలకుంటలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి వంటకాల రుచిని, నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం వంటకాలు చేయకపోవడంతో ఎండీఎం ఆపరేటర్‌ను మందలించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించాలని, విద్యార్థులకు కోడిగుడ్డు, చిక్కీలు క్రమం తప్పకుండా అందించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహణ, విద్యాబోధన తదితర అంశాలపై హెచ్‌ఎం, ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బిళ్ళా రాజారమేష్‌ను ఎంఈవో అభినందించారు. అనంతరం పోట్లూరు ప్రాథమిక పాఠశాలలో రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు, పరిసరాల పరిశుభ్రత, స్కూల్ కిట్స్ పంపిణీ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్‌ఎం సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయని శివరంజని, సీఆర్పీ ఎలికా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో న్యాయవాది శ్రీనివాసరావు మృతి

గుంటుపాలెం (శావల్యాపురం) జూన్ 28: మండలంలోని గుంటుపాలెం గ్రామానికి చెందిన న్యాయవాది పూరేటి శ్రీనివాసరావు(57) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను గుంటుపాలెంలో శుక్రవారం నిర్వహించారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు 15ఏళ్ళుగా న్యాయవాది వృత్తిలో ఉన్నారు. గతేడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. వినుకొండ బార్ అసోషియేషన్ సభ్యులు, గ్రామస్థులు శ్రీనివాసరావుకు నివాళులర్పించారు.

బార్ అసోసియేషన్ నివాళి

వినుకొండ, జూన్ 28: అనారోగ్యంతో మృతిచెందిన న్యాయవాది పూరేటి శ్రీనివాసరావు సంస్మరణ సభ స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో అధ్యక్షుడు కె.ఎస్.ఎం.వి నాయుడు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పూరేటి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి న్యాయవాదులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రామకోటేశ్వరరావు, పీ.జే లూక, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, పోట్లూరి సైదారావు, తెలగంశెట్టి హనుమంతరావు, పఠాన్ గౌస్ మొహిద్దీన్, చీమకుర్తి బ్రహ్మం, సిద్ధయ్య, బి.శ్రీనివాసరావు, మీసాల శ్రీనివాసరావు, మారెళ్ళ సీతారామాంజనేయులు, వడ్లమాని అమర్ బాబు, కాళంగి చెన్నయ, నక్క రమణరావు, కాకాని నాగేశ్వరరావు, ఆళ్ల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అవగాహన కార్యక్రమం

యడ్లపాడు, జూన్ 28: పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ జూలై నెల పింఛన్‌ను ఒకటవ తేదీన ఇంటి వద్దకే వెళ్ళి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ నుంచి పింఛన్‌ను రూ.4వేలకు పెంచిందని, పెరిగిన పింఛన్‌ను జూలై నెల పింఛన్‌తో కలిపి రూ.7వేలు జూలై 1వ తేదీన లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రతి క్లస్టర్‌లోని పింఛన్‌దారులకు పింఛన్‌ను పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం 12సచివాలయాలు ఉండగా ఆయా సచివాలయాల పరిధిలో వివిధ సామాజిక పింఛన్లు పొందే లబ్ధిదారులు 8,073మంది ఉన్నారన్నారు. వారికి రూ.5.43కోట్లు మొత్తాన్ని పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, ఏవో సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చేసిన తప్పులు తెలుసుకుంటే జగన్‌రెడ్డికే మేలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 28: మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేసిన తప్పులు తెలుసుకుంటే ఇప్పటికైనా అతడికే మేలని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హితవు పలికారు. శుక్రవారం పట్టణంలోని పెదనందిపాడు రోడ్డులో దాసరి కాలనీలో శ్రీకనకదుర్గ అమ్మవారి 30వ తిరునాళ్ళలో ప్రత్తిపాటి పాల్గొని మాట్లాడుతూ చేసిన పాపాలతో వైనాట్ 175 అని విర్రవీగి ఈ పరిస్థితుల నుంచి ప్రతిపక్ష హోదాను ఇవ్వాలని అడుక్కొనే స్థాయికి పడిపోయినా అతడికి ఇంకా కనువిప్పు కలగకపోవటమే ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. దేవతల రాజధాని అమరావతినే కలకాలం వర్ధిల్లాలని, అదేపేరుతో ప్రారంభించిన అమరావతి నగరం విధ్వంసం చేయాలన్న దుర్బుద్ధి పుట్టిన రోజే జగన్ దుస్థితికి బీజం పడిందన్నారు ఆయన ఆ తరువాత మూడు రాజధానుల పేరిట మొదలు పెట్టిన నాటకాలు, ఆడిన అబద్ధాలు, చేసిన మోసాలు, ఇప్పటికైనా ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం కార్యక్రమంలో ప్రత్తిపాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు విద్యుత్ సబ్ మెర్సిబుల్ మోటార్లు చోరీ

యడ్లపాడు, జూన్ 28: పంటలకు నీటి తడులందించేందుకు పొలాల్లోని బోరు బావులకు అమర్చిన ఆరు విద్యుత్ సబ్ మెర్సిబుల్ మోటార్లు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్ళారు. ఒకేరోజు రెండు గ్రామాల పరిధిలో జరిగిన ఈ ఘటనతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. బాధితుల కథనం మేరకు మండలంలోని సొలస గ్రామానికి చెందిన రైతు, ఎంపీటీసీ సభ్యుడు మద్దూరి శ్రీనివాసరెడ్డి గ్రామపరిధిలో నిమ్మతోట సాగుచేస్తుండగా అదే గ్రామానికి చెందిన వెంకట్రావు జామతోట సాగు చేస్తున్నాడు. శ్రీనివాసరెడ్డి మొక్కలకు నీటి తడులను అందించేందుకు పొలంలో బోరువేసి 5హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మూడు మోటార్లను అమర్చగా, వెంకట్రావు 5హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ఒక మోటారును అమర్చాడు. రోజులాగే శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి మోటార్లు ఆన్‌చేసేందుకు ఉపక్రమించగా మోటార్లు, నీటి పైపులు, విద్యుత్ వైర్లు కానరాలేదు. దీనితో మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. అలాగే చెంఘీజ్‌ఖాన్‌పేటలో పంచాయతీ రక్షిత తాగునీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు ఎక్కించేందుకు ఏర్పాటుచేసిన 1.5హెచ్‌పి సామర్థ్యం కలిగిన రెండు విద్యుత్ మోటార్లు కూడా చోరీకి గురయ్యాయి. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన పంచాయతీ సిబ్బంది మోటార్లు, కరెంటు తీగ, పైపులు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన 5హెచ్‌పి మోటార్ల విలువ రూ.2..80లక్షలు ఉంటుందని రైతులు తెలుపగా, 1.5 హెచ్‌పి మోటార్ల విలువ రూ.1.25లక్షలు ఉంటుందని పంచాయతీ సిబ్బంది తెలిపారు. చోరీపై రైతులు, పంచాయతీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

డాక్టర్ కొల్లా రామారావుకు పలువురి నివాళి

చిలకలూరిపేట, జూన్ 28: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కొల్లా రామారావు మృతికి శుక్రవారం పలువురు సంతాపం ప్రకటించారు. స్థానిక సీఆర్ కాలనీలోని ఆయన గృహం వద్దకు ఎమ్మెల్యే, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పట్టణానికి చెందిన పలువురు వైద్యులు వెళ్ళి నివాళులర్పించారు. ఆయన మృతికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడు సంతాపం ప్రకటించారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జూన్ 28: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. గణపవరం సెక్షన్‌లోని కొత్తలైన్‌ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. స్టేట్ బ్యాంక్ రోడ్డు, సాయిబాబాగుడి రోడ్డు, చిలకలూరిపేట డొంక రోడ్డు, తిరుమల లక్ష్మీ రైస్ మిల్లుల ప్రాంతాలతో పాటు నాదెండ్ల మండలం సాతులూరు, దొండపాడు, చందవరం, సాతులూరు ఇండస్ట్రీస్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

చిలకలూరిపేట, జూన్ 28: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. సంస్థ సీనియర్ సభ్యుడు ఏవీ శివయ్య మాట్లాడుతూ చిలకలూరిపేట డివిజన్ పరిధిలో నాలుగు వందలమందిని సభ్యులుగా చేర్చుకొనేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. వచ్చే నెల 15వ తేదీలోపు సభ్యత్వాలు పూర్తిచేయాలని కోరారు. మూఢవిశ్వాసాలపై పోరాటం చేసేవారు, శాస్త్రీయ దృక్పథం, సైన్స్‌వ్యాప్తి చేయటం పట్ల ఆసక్తిగా ఉన్న వారు ఎవరైనా చేరవచ్చన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, ఉన్నవ రమేష్, కే శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పీవీ సుబ్బారావు, చుక్కా విన్సెంట్ పాల్, ఆంజనేయరాజు తదితరులు ఉన్నారు.